యాజమాన్యాలు భద్రతా చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: ప్రైవేట్ ఆసుపత్రుల్లో యాజమాన్యాలు భద్రతా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ ఏసీపీ బి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. దుండిగల్‌లోని అరుంధతి ఆసుపత్రిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో వైద్యురాలిపై సామూహిక లైంగిక దాడి, హత్య చేసిన విషయం తెలిసిందే. దేశంలోనే ఈ ఘటన సంచలనంగా మారింది. ఈ క్రమంలో పోలీసులు ముందస్తుగా ఆయా ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను ఆసుప్రతిలో తప్పకుండా అమర్చాలని, 24 గంటల పాటు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలన్నారు. రోగుల సంబంధికుల కదలికలను పరిశీలించాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో దుండిగల్ సీఐ పి.సతీష్, ఎస్బీ సీఐ జానయ్య, షీ టీమ్స్ సీఐ సునిత, పోలీస్ సిబ్బంది, ఎంఎల్ఆర్ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన


స్థానికులతో కలిసి లోతట్టు ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శేషగిరి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ పరిధిలోని రావి నారాయణరెడ్డినగర్, న్యూ భవానీనగర్, సంఘమిత్ర స్కూల్ ప్రాంగణం, కైసర్ నగర్‌లలో బుధవారం కార్పొరేటర్ రావుల శేషగిరి పర్యటించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రోడ్లు దెబ్బతినడం, డ్రైనేజీ లైన్‌లు పొంగి పొర్లడంతో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్, ఓబీసీ జిల్లా ప్రచార కార్యదర్శి మురళీకృష్ణ, శ్రీనివాస్, బాలకృష్ణ, ప్రభాకర్, శేఖర్, శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

దుండిగల్: విద్యుదాఘాతంతో ఓ గేదె మృత్యువాత పడింది. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట ప్రాంతానికి చెందిన రైతు నాచారం మల్లేష్ యాదవ్ గేదెలను స్థానికంగా మేత మేసేందుకు తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలో క్రీక్ స్కూల్ గేట్ ఎదుట ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదె మేస్తుండగా విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆ సమయంలో మిగిలిన గేదెలు దూరంగా ఉండటంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగా 41 కేవీ లైన్‌కు అల్లుకు పోయిన తీగలను తొలగించకపోవడం వల్ల విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో మనుషులు ఉంటే తీవ్ర ప్రాణ నష్టం వాటిల్లేదన్నారు. రూ.2 లక్షల నష్టపరిహారం అందించాలని రైతు కోరారు.



వరద నీటిని తొలగించరూ?

రంగారెడ్డినగర్: వర్షాలకు ప్రధాన రోడ్లపై వరద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ జంక్షన్– జగద్గిరిగుట్ట రోడ్డు మార్గంలో స్వామి వివేకానంద విగ్రహం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వరదనీరు చేరుతోంది. ఈ ప్రాంతంలో వర్షపునీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాత్రి వేళల్లో నీటి లోతును గమనించక వేగంగా వచ్చే ద్విచక్ర వాహనదారులు జారీ పడుతున్నారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు సైతం లేకపోడం గమనార్హం. ప్రస్తుతం ఈ ప్రాంతంలో డ్రెయిన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నా.. మరికొద్ది రోజులు పట్టే అవకాశముంది. సంబంధిత అధికారులు రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వరదనీటిని తరలించే ఏర్పాట్లు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


స్వామి వివేకానంద విగ్రహం సమీపంలో చేరిన వరదనీరు

నత్తనడకన డ్రైనేజీ పనులు

- తవ్విన రోడ్లతో తిప్పలు
- వర్షంతో నడవడానికి కూడా వీలు లేని వైనం
- 4 నెలలు గడుస్తున్నా పూర్తికాని డ్రైనేజీ నీటి మళ్లింపు పనులు




డ్రైనేజీ పనుల కోసం తవ్విన రోడ్డు

నిజాంపేట్: డ్రైనేజీ నీటిని మళ్లించే పనులను నాలుగు నెలల క్రితం ప్రారంభించారు. ఇప్పటి వరకు పనులు పూర్తి చేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని తుర్క చెరువు ఎగువ ప్రాంతం నుంచి చెరువులోకి చేరే డ్రైనేజీ నీటిని చెరువులోకి రాకుండా చెరువు దిగువన ఉన్న రాజధాని స్కూల్ దగ్గర నాలాలోకి కలిసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేసి ప్రణాళికలను సిద్ధం చేశారు. దీంతో పనులను మే నెలలో ప్రారంభించారు. రెండు నెలల్లో పూర్తవ్వాల్సిన పనులు రోజు రోజుకు ఆలస్యం అవుతుండటంతో సాయినగర్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు తవ్వకాలతో ఇబ్బందులు

సాయినగర్‌లో పైపు లైన్ కోసం తవ్విన రోడ్లను సకాలంలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదు. పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారి కనీసం నడుచుకుంటూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పనులు పూర్తి చేసిన ప్రాంతంలో ఉన్న రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మిస్తే కొంతలో కొంతైనా ఇబ్బందులు తొలగుతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కిలో మీటర్ కూడా పూర్తవ్వలేదు

ప్రగతినగర్‌లోని 2వ డివిజన్, ఆర్‌కే లే అవుట్ నుంచి సాయినగర్ మీదుగా ఆదిత్య గార్డెన్, రాజీవ్ గృహకల్ప తుర్క చెరువు బయటి నుంచి రాజధాని స్కూల్ దిగువన నాలాలోకి కలిపే విధంగా డ్రైనేజీ పనులు చేపట్టారు. వీటి కోసం 900 డయా పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి పనులు ప్రారంభించారు. కనీసం కిలో మీటర్ కూడా పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఆ ప్రాంతం నుంచి నడవడానికి కూడా వీలు లేని దుస్థితి నెలకొంది.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

కూకట్‌పల్లి: నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు బుధవారం కార్పొరేటర్లతో కలిసి కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేద ప్రజల ఇళ్లకు జారీ చేసిన నోటీసులను ఉప సంహరించుకోవాలని కోరారు. టీఎస్ హౌసింగ్ బోర్డు నుంచి స్థలం స్వాధీనం చేసుకొని హైస్కూల్ కోసం కేటాయించాలన్నారు. అల్లాపూర్ సర్వే నెంబర్ 18లోని ప్రభుత్వ స్థలాన్ని జిల్లా పరిషత్ హైస్కూల్ కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ముద్దం నరసింహ , రవీందర్‌రెడ్డి, సతీష్ గౌడ్, సబిహా బేగం, సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి


మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న సుధీర్ తదితరులు

సుభాష్‌నగర్: మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్ టీయూడబ్ల్యూ జేహెచ్– 143 అధ్యక్షుడు సుధీర్ మంకాల అన్నారు. శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సూరారం కాలనీ మార్కెట్ రోడ్డులోని శ్రీవిజయ దుర్గ అమ్మవారి ప్రాంగణంలో మట్టి గణపతులను ఉచితంగా భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్, ప్రధాన సలహాదారులు సర్వేపల్లి రమేష్ కుమార్, ఆలయ ప్రధాన పూజారి శ్రీరామశర్మ, సింహాచలం శ్రీధరాచార్యులు, హరి రాఘవేంద్ర, టీఎంజేయూ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ప్రెస్ క్లబ్ సభ్యులు మాధవరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్: రోడ్డు వెడెనింగ్ పనుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలో శ్రీహోమ్స్ కాలనీ, క్రాంతినగర్ కాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎస్సీ గురుకులాల్లో వసతులు కల్పించాలి

నిజాంపేట్: ఎస్సీ గురుకుల పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీఎస్పీ నియోజకవర్గ నాయకురాలు ప్రేమలత డిమాండ్ చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ గురుకులాల్లో బ్రహ్మకుమారీస్ ఆధ్మాత్మిక సంస్థతో సైకాలాజిస్ట్ తరగతులు నడిపించాలనే ఒప్పందాన్ని రద్దు చేసి అర్హులైన సైకాలజిస్ట్‌లు, ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు వసతులు కల్పించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు


విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్: విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్, మల్లంపేట, బౌరంపేట గ్రామంలోని ఫేజ్–3లో విద్యుత్ హెచ్చుతగ్గులపై స్థానికులు ఇటీవల హన్మంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. అదే విధంగా కేవీఆర్, స్ప్రింగ్ వుడ్స్, ప్రణీత్ నతురల్ బౌంటీ, ల్యక్ రిడ్జ్ కాలనీల్లో తరుచూ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి నూతనంగా సబ్ స్టేషన్‌ను మంజూరు చేయించారు. బుధవారం సదరు సబ్ స్టేషన్ ఏర్పాటు చేసే స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కొత్తగా సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ప్రజలకు కరెంటు కష్టాలు తీరుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ రంజి, ఏడీఈ అరుణ్, ఎస్ఈ రవికుమార్, జీడిమెట్ల డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, బాచుపల్లి ఏఈ శాంతకుమార్, కూకట్‌పల్లి డీఈ చక్రవర్తి, మియాపూర్ ఏడీఈ హరికృష్ణ, బౌరంపేట ఏఈ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: గణేశ్ నవ రాత్రోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఆయా విభాగాల అధికారులు, కార్పొరేటర్లతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతుల కొనుగోళ్లను ప్రోత్సహించాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్, విద్యుత్, పారిశుధ్య, టౌన్‌ప్లానింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రోడ్లపై చెత్తను, విరిగి పడిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడూ తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. చెరువుల వద్ద క్రేన్‌ల ఏర్పాటుతో పాటు ఫడ్‌లైట్లను అమర్చాలని, నిమజ్జనాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. సమావేశంలో కమిషనర్ సౌజన్య, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ పాల్గొన్నారు.

అలుగు పారుతున్న చెరువులు



సుభాష్‌నగర్: భారీ వర్షాలతో శివారు ప్రాంతాల్లోని చెరువులు నిండు కుండగా మారాయి. దీంతో చెరువులు అలుగు పారుతున్నాయి. దూలపల్లిలోని తుమార్ చెరువు అలుగు పారడంతో చెరువులోంచి చేపలు సైతం నీటి ప్రవాహంలో బయటకు కొట్టుకొస్తున్నాయి. దీంతో స్థానికులు అలుగు వద్ద చేపలను పడుతూ విక్రయాలు చేపడుతున్నారు. బుధవారం కొందరు వ్యక్తులు అలుగు వద్ద చేపలు పట్టి తమ ఇళ్లకు తీసుకువెళ్లారు.



షాపూర్‌నగర్ ప్రధాన చౌరస్తా ఆటోవాలాలకు అడ్డగా మారింది. గాజులరామారం వెళ్లే దారిలో ఈఎస్ఐ ముందు ఉన్న బస్టాప్‌లో పార్కింగ్ చేయడం వల్ల ప్రయాణికులు రోడ్డు మీద నిలబడే దుస్థితి నెలకొంది. కేవలం ట్రాఫిక్ చలాన్ పైనే దృష్టి సారించే పోలీసులు ఉషోదయ టవర్ వద్ద ట్రాఫిక్ చలాన్ రాస్తూ బిజీగా ఉండగా.. కూత వేటు దూరంలో ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న ఆటోలను గుర్తించకపోవడం విమర్శలకు తావిస్తోంది.
– కుత్బుల్లాపూర్

ఎవర్ 'గ్రీన్' వర్సిటీ

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ జీవ వైవిధ్యానికి ఆనవాలుగా ఉంది. పురివిప్పిన నెమళ్లు ... జింకలు, దుప్పిల విహారం.. కుందేళ్ల దోబూచులాటలు... పక్షుల కిలకిలారావాలు.. అడవి, ముళ్ల పందుల హంగామా.. నెలకొంది. ఇక ఎటుచూసినా పచ్చదనంతో అలరారుతోంది. నేడు నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిన నేపథ్యంలో నగర శివారులోని గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆహ్లాదకరంగా ఉంది. భారీ బండరాళ్లు, వృక్ష సంపద, పండ్లు, పూలు, ఔషధ మొక్కలు, పచ్చిక బయళ్లు, నీటి వనరులు, భారీ వృక్షాలు, పురాతన రాతి సంపద ఈ క్యాంపస్ ప్రత్యేకం. నగర శివారులో అతిపెద్ద జీవవైవిధ్య కేంద్రంగా హెచ్‌సీయూ గుర్తింపును సొంతం చేసుకుంది. – రాయదుర్గం


హెచ్‌సీయూ క్యాంపస్‌లో పచ్చదనం

జీవ వైవిధ్యం..హెచ్‌సీయూ సొంతం





- పక్షులు, నెమళ్లు, జింకలు, ఇతర జీవాలకు నెలవు
- 50 ఏళ్లుగా కాపాడుతున్న 'పట్టణ అటవీ ప్రాంతం'
- భవిష్యత్ తరాలకు ఇది వరం

- జింకలు, దుప్పిలు, నెమళ్లు, అడవి పందులు, ముళ్ల పందులు, కుందేళ్లు, జింకలు, ఎన్నో రకరకాల పక్షులు, కీటకాలు, పాములు , బల్లులు, ఊసరవెల్లులు, తాబేళ్లు, ప్రధానంగా నక్షత్ర తాబేళ్లు.. ఇలా మొత్తం 200 రకాల జాతులు హెచ్‌సీయూ ప్రాంగణంలో ఉన్నాయి.
- క్యాంపస్‌లోని అటవీ ప్రాంతాన్ని అలాగే కొనసాగిస్తూ పక్షులు, జీవాల కోసం ప్రత్యేకంగా 40 వరకు నీటి భారీ టబ్‌లను ఏర్పాటు చేసి వేసవిలో వాటి దప్పిక తీరుస్తున్నారు.
- కొన్ని సందర్భాలలో వీటికి ఆహారాన్ని కూడా అందించే ఏర్పాట్లు చేశారు. ఇలా యూనివర్సిటీ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

చేపట్టిన చర్యలు..

- వర్షాకాలంలో హరితహారం కింద ప్రతిఏటా వేలాది మొక్కలు నాటుతున్నారు
- క్యాంపస్‌లో ప్రత్యేకంగా సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కలను పెంచుతూ వస్తున్నారు.
- బర్త్‌డే రోజున మొక్కలు నాటేందుకు బర్త్‌డే పార్కును కూడా నిర్వహిస్తున్నారు.
- అటవీ ప్రాంత పరిరక్షణకు ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు
- క్యాంపస్‌లోని పికాక్ లేక్, గుండ్లకుంట, చిలకల కుంట, గన్నేరు కుంటలను కాపాడుతున్నారు
- అలాగే పలుచోట్ల రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ ఏర్పాటు చేశారు
- క్యాంపస్‌లో ఏటా ఎన్ఎస్ఎస్ విభాగం, హార్టికల్చర్ విభాగం, శానిటరీ విభాగం, విద్యార్థి సంఘాలు హరితహారం కింద, రకరకాల పేర్లతో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు
- ప్రత్యేకంగా ఈ ఏడాది ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట మొక్కలను నాటే కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ మొక్కలు నాటారు. భవిష్యత్తులో కూడా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఎకరం స్థలంలో స్వచ్ఛంద సంస్థతో కలిసి మియా వాకీ పేరిట చిట్టడవిని పెంచుతున్నారు.







జీవ వైవిధ్య పరిరక్షణకు చర్యలు అవసరం



- ప్రతి ఏటా అటవీ ప్రాంతంలో డిసెంబర్ నుంచి జూన్ వరకు జరిగే అగ్ని ప్రమాదాలను అరికట్టాలి.
- క్యాంపస్‌లో ప్రత్యేకంగా మినీ అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి
- మరిన్ని మియా వాకీ ప్రాజెక్టుల ద్వారా చిట్టడవులను పెంచాలి
- వేసవిలో జంతుజాలానికి ఆహారం, నీటి సౌకర్యాన్ని మరింత పెంచేలా చూడాలి
- క్యాంపస్ నలుమూలలా వాచ్‌టవర్లను నిర్మించి, ప్రత్యేక సెక్యూరిటీ గార్డులను నియమించాలి.


హెచ్‌సీయూ క్యాంపస్‌లో చెరువు


హెచ్‌సీయూలో జింకల సందడి


ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట మొక్క నాటిన వీసీ ప్రొ.బీజేరావు